

తోక పత్రికలతో విష ప్రచారం

మాజీ సీఎం వైఎస్ జగన్‌పై అసత్య రాతలను రాస్తున్న పచ్చ పత్రికలకు ప్రజలు బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. -8లో



సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదాలు

సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా సర్కారు ముందుకెళుతోందని మంత్రి, జనార్దన్‌రెడ్డి అన్నారు. -8లో



కాదేదీ ఆక్రమణకు అనర్హం!

ఏకంగా నాలుగురోడ్ల కూడలినే ఆక్రమించేశారు ఆక్రమణదారులు. నెల రోజులుగా ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకోలేక అధికారులు అవస్థలు పడుతున్నారు. -8లో

సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 29 । నవంబర్ । 2024

న్యూస్‌రీల్

30న పింఛన్ల పంపిణీ

రామసముద్రం: వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్ నగదును ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు పెన్షన్ పంపిణీపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్, ఏఓ, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో శనివారమే యధావిధిగా సిబ్బంది, పెన్షన్ లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయాలని సూచించారు.

నేటి నుంచి వైవీయూ డిగ్రీ పరీక్షలు ప్రారంభం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఈనెల 29 నుంచి డిసెంబర్ 21వ తేదీ వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాల్లో 1వ, 3వ, 5వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రథమ సెమిస్టర్ పరీక్షలకకు 8407 మంది, తృతీయ సెమిస్టర్‌కు 6903, 5వ సెమిస్టర్ పరీక్షలకు 5509 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వైవీయూ పరిధిలో నిర్వహించే డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు తెలిపారు.

నేటి నుంచి ఎంఎస్ఎంఈల సర్వే

రాయచోటి: జిల్లాలో శుక్రవారం నుంచి ఎంఎస్ఎంఈల సర్వేను పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఎంఎ,ఎంఈల సర్వే అంశంపై జిల్లాస్థాయి పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సర్వేలో భాగంగా డివిజన్ స్థాయిలో ట్రేడ్ అసోసియేషన్లను భాగస్వామ్యం చేసి అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ ఔత్సాహిక ఎంఎస్ఎంఈల ప్రతినిధులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో రైల్వే ఐజీ



రైల్వే ఐజీకి స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయాన్ని గురువారం సికింద్రాబాద్ రైల్వే ఐజీ అరోమా సింగ్ ఠాకూర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. ఆమె బాలాలయంలో ఉన్న సీతారామ లక్ష్మణ మూర్తుల విగ్రహాలను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సేదతీరిన ఆమెను ఆలయఅర్చకులు ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

7న సమావేశం

రాయచోటి: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో డిసెంబర్ 7న ఒక మెగా పేరెంట్ టీచర్ సమావేశాన్ని పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ విషయమై గురువారం రాయచోటి కలెక్టరేట్‌లో ఒక రోజు జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని 20178 పాఠశాలల్లో డిసెంబర్ 7న ఒక పండుగ వాతావరణంలా మెగా పేరెంట్ టీచర్ సమావేశాన్ని నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. అతిథులతో విద్యార్థులను ప్రోత్సహించేలా మాట్లాడించాలని, తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించాలన్నారు. అపార్ ఐడీ జనరేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ ఈఓ శివరాం రెడ్డి, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ కరుణాకర్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

స్థిరమైన అభివృద్ధి ముఖ్యం

రాయచోటి టౌన్: ఆర్థిక స్థిరత్వంతో పాటు స్థిరమైన అభివృద్ధి కూడా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ప్రతినిధి నివీన్ చిరినెల్లి అన్నారు. గురువారం రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఆర్బీఐ 90 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడే బాధ్యత కూడా ఆర్బీఐ చేపట్టిందన్నారు. ఈ క్రమంలో రాయచోటిలోని ప్రభుత్వం డిగ్రీకళాశాల ఆవరణంలో జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో సపోటా, మామిడి, జామ, అల్లనేరేడు, నిమ్మ వంటి ఫలాలను ఇచ్చే మొక్కలు నాటించారు. ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా) రాయచోటి అసిస్టెంట్ మేనేజర్ బాషా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తపాలా చుట్టూ తిప్పలు

- బాబు రూ.1500 జమ చేస్తారనే ప్రచారం
- తపాలా కేంద్రాలకు భారీగా తరలివస్తున్న మహిళలు
- ఉదయం నుంచే వందలాది మహిళల క్యూ
- సూపర్‌సిక్స్ పథకాల కోసమేనని ప్రచారం
- ఐపీపీబీ అకౌంట్ ఓపెన్ కోసం ఆరాటం



రాయచోటి పోస్టాఫీసులో మహిళల రద్దీ



రాజంపేట పోస్టాఫీసు వద్ద మహిళల క్యూ

రాజంపేట: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని అన్ని తపాలా కేంద్రాలు వేలాదిగా తరలివస్తున్న మహిళల తాకిడితో కిక్కిరిసిపోతు న్నాయి. 18 ఏళ్లపైబడిన మహిళలందరి వ్యక్తిగత ఖాతాల్లో సీఎం చంద్రబాబు రూ.1500 జమచేస్తారన్న విస్తృత ప్రచారంతో మహిళలు పోస్టాఫీసుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ప్రతిరోజు చలిని సైతం లెక్క చేయకుండా ఉదయం 5గంటల నుంచి క్యూ కడుతున్నారు. నెలరోజులుగా పరిస్థితి ఉన్నా.. ఈ మధ్య రోజురోజుకు వీరి సంఖ్య మరింతంగా పెరుగుతోంది. పోస్టాఫీసుల వద్ద తోపులాట జరిగే స్థాయి ఉందంటే మహిళల తాకిడి ఎలా ఉందో అర్థమవుతుంది. కడప, ప్రొద్దుటూరులో పోస్టాఫీసు డివిజన్లు ఉన్నాయి.

డివిజన్	పోస్టాఫీసులు	ఏపీపీబీ ఖాతాలు
కడప	451	73,173
ప్రొద్దుటూరు	376	30,000

సూపర్ సిక్స్ పథకాల కోసమంటూ..

టీడీపీ కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలు ఒకొక్కటిగా అమలు చేస్తామంటూ కూటమి నేతలు పదేపదే చెబుతున్నారు. ఇందులో భాగంగా 18 ఏళ్లు నిండిన మహిళ ఖాతాల్లో రూ.1500 జమ చేస్తారని ప్రచారాన్ని జనం మధ్యలోకి కూటమి నేతలు తీసుకెళ్లారు. దీంతో మహిళలు అది నిజం అని నమ్మి పోస్టాఫీసులు చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్నారు. మహిళలు భారీ సంఖ్యలో వస్తున్న క్రమంలో అందుకు తగ్గట్టుగా చర్యలేవీ కనిపించడంలేదు.

బ్యాంకర్స్‌పై సీడింగ్ చేయడం లేదనే ఆరోపణలు

బ్యాంకర్లు ఖాతాలకు ఆధార్‌లింక్ చేస్తున్నా, సీడింగ్ చేయడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగా మహిళలు తపాలశాఖ ఇచ్చే ఐపీబీఏ ఖాతాలు తెరిచేందుకు భారీగా తరలివస్తున్నారు. ఇప్పటి వరకు బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ కాని వారు ఉభయ వైఎస్సార్ జిల్లాలో లక్షలాదిమంది ఉన్నట్లు సమాచారం. బ్యాంకులలో ఆధార్ సీడింగ్ కాని మహిళలు ఐపీబీఏ ఖాతాల కోసం తపాలా కేంద్రాలకు తరలివెళుతున్నారు.

రూ.1500పై ఉన్నతాధికారులు స్పందించాలి

ఉన్నతాధికారులు స్పందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మహిళలు రూ.1500 చొప్పున ఖాతాల్లో ఎప్పుడు జమచేస్తారు. అందుకోసం మహిళలు ఏమి చేయాలి. ఇప్పటికే బ్యాంక్ ఖాతాలున్న మహిళలు ఏం చేయాలి. ఖాతాలు లేని వారు ఏ పోస్టాఫీ సుకు లేదా ఏ బ్యాంకును సంప్రందించాలనే స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరోవైపు రూ.1500 వట్టి ప్రచారమన్న భావనలు జనంలో వినిపిస్తున్నాయి.

నగదు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతా కోసం..

నగదు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతా కోసం మహిళలు తపాలా కేంద్రాలకు వెళుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఐపీపీబీ (ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్) ఖాతాల్లో జమ అవుతాయి. ఇందులో ఖాతాలు తెరిచినంత మాత్రాన లాభంలేదు. ఆధార్ లింక్ కాగలిగివుండాలి. ఆధార్ సీడింగ్ అయి ఉండాలి.

ఖాతాల ఓపెనింగ్‌కు విశేష స్పందన



ఐపీపీబీ(ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకు) ఖాతాలకు విశేష స్పందన లభిస్తోంది. జిల్లాలోని అన్ని పోస్టాఫీసులలో మహిళలు ఖాతాలను తెరుచుకుంటున్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఖాతాలను తెరుచుకునేందుకు పోస్టాఫీసు సిబ్బంది సంపూర్ణ సహకారం అందిస్తున్నారు.

– రాజేష్, పోస్టల్ సూపరింటెండెంట్, కడప

మహిళల పడిగాపులు



సింగారెడ్డిపల్లి పోస్టాఫీసు వద్ద వేచి ఉన్న మహిళలు

పెనగలూరు: ఎన్‌పీసీఐ అకౌంట్లకోసం మండలంలోని సింగారెడ్డిపల్లి సబ్ పోస్టాఫీసు కార్యాలయం దగ్గర మహిళలు ఉదయం నుండి పడిగాపులు కాస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఎన్పీసిఐ అకౌంట్ తప్పనిసరిగా చేయించుకోవాలని మహిళలు అపోహతో పోస్టాఫీసు దగ్గరకు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 7 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు పోస్టాఫీసు దగ్గర పడిగాపులు కాస్తున్నారు. తపాలా కార్యాలయం వారు కూడా సరియైన అవగాహన కల్పించడం లేదు. సచివాలయ సిబ్బంది అకౌంట్లను తయారు చేసేందుకు గ్రామాలకు వచ్చి చేస్తారన్న విషయాన్ని మహిళలు గ్రహించాలి.

2న జాతీయస్థాయి ఉర్దూ కవి సమ్మేళనం



జాతీయ కవి సమ్మేళనం పోస్టర్లను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు, కవులు

రాయచోటి అర్బన్: రాయచోటి పట్టణంలో డిసెంబర్ 2 వతేదిన జాతీయస్థాయి ఉర్దూ నాతియా ముషాయిరా (కవి సమ్మేళనం) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం పట్టణంలోని అలీమాబాద్ వీధిలోగల గఫారియా ఫంక్షన్ హాల్‌లో ఉర్దూ కవిసమ్మేళనం పోస్టర్లను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 2వతేది స్థానిక గఫారియా ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి అధ్యక్షుడిగా డాక్టర్ వసీవుల్లా భక్తియారి, ముఖ్య అతిధిగా తజివుద్దీన్ హుస్సేనీ సాహెబ్ పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రముఖ జాతీయ స్థాయి ఉర్దూకవులు, స్థానిక ఉర్దూకవులు పాల్గొంటారన్నారు. కమిటీ సభ్యులు సబాతుర్ రహిమాన్, మహమ్మద్ హాషీం, సునీర్, జాఫర్, ఆరీఫ్, మున్వర్, సదా, అసదుల్లా పాల్గొన్నారు.

డిజిటల్ విధానంలో పన్నుల చెల్లింపులు



మాట్లాడుతున్న డీపీఓ బాలకృష్ణా రెడ్డి

కురబలకోట: పంచాయతీ పన్నులు ఇకపై డిజిటల్ విధానంలో చెల్లించవచ్చని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన అంగళ్ల పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు ఇతర పంచాయతీ పన్నులను డిజిటల్ విధానంలో చెల్లించవచ్చన్నారు. అక్రమాలు, అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా ఉండేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గ్రామాల్లో పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి పాల్గొన్నారు.

8న సాగునీటి సంఘాలకు ఎన్నికలు

- డిసెంబర్ 5న ఎన్నికల ప్రకటన
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: ప్రశాంత వాతావరణంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సాగునీటి వినియోగదారుల సంఘ ఎన్నికలపై జిల్లా నీటి వనరుల శాఖ, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. అన్నమయ్య జిల్లాలో వంద ఎకరాలకు పైబడి ఆయకట్టు కలిగిన 167 చెరువులకు సంబంధించి డిసెంబర్ 8న నీటి వినియోగదారుల, సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తారని వివరించారు. డిసెంబర్ 5న సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన వెలువడుతుందని... డిసెంబర్ 8వ తేదీన ఒకే రోజు పూర్తి ఎన్నికల ప్రక్రియ ఉంటుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన్‌రావు, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లు వందశాతం పంపిణీ చేయాలి

జిల్లాలో ఈ నెల 30న సామాజిక పింఛన్లను నూరు శాతం పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటిలోని వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి సబ్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంఆర్‌ఓలు, ఎంఈఓలు, పంచాయతీరాజ్, హౌసింగ్, ఇంజనీరింగ్ సిబ్బంది, ఎంఈఓలు, ఎంఏఓ, ఈఈలు, డీఈలు, సచివాలయ సిబ్బంది తదితరులతో కలెక్టర్ సమీక్షించారు. దీంతో ఆయా పథకాలు, అభివృద్ధి పనుల్లో చేపట్టాల్సిన చర్యలు గురించి కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.

- జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు, సబ్ కలెక్టర్లు మేఘ స్వరూప్, వైఖోమ్ నదియా దేవి, ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా, అధికారులు పాల్గొన్నారు.

డీఆర్‌యూసీసీ మెంబర్‌గా తల్లెం కొనసాగింపు

ఓబులవారిపల్లె: గుంతకల్లు రైల్వే వినియోగదారుల కమిటీ సభ్యుడిగా తల్లెం భరత్ కుమార్ రెడ్డి రెండేళ్ల పాటు కొనసాగిస్తున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకం ఉంచి మరో రెండేళ్ల డీఆర్‌యూసీసీ మెంబర్‌గా కొనసాగించేందుకు అవకాశం కల్పించిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి తల్లెం భరత్ కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అన్నమయ్య జిల్లా వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డికి, వైఎస్సార్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న డీఆర్‌యుసీసీ మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి

'ఒంటిగంటకే ఫైనల్ బెల్'తో కదలిక!

- ఇంటర్ కమిషనరుతో రాజ్యసభ సభ్యుడు మేడా చర్చలు
- షిఫ్ట్ నుంచి హైస్కూలు, ఇంటర్‌కు విముక్తి కల్పించాలి



నందలూరు హైస్కూల్ క్యాంపస్

సాక్షి ఎఫెక్ట్..

రాజంపేట: నందలూరు జిల్లా పరిషత్ పాఠశాల పరిస్థితిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. మూడు దశాబ్దాల తర్వాత తొలిసారిగా హైస్కూల్ తరగతు లను రెండుపూటలా నిర్వహించారు. 'ఒంటిగంటకే ఫైనల్ బెల్' శీర్షికన 'సాక్షి'లో ఈనెల 26న ప్రచురిత మైన కథనానికి అధికారులు స్పందించారు. శతాబ్ది న్నర కాలం నాటి ఈపాఠశాల ఐఏఎస్‌ల పాఠశాలగా గుర్తింపు పొందింది. కానీ మూడు దశాబ్దాలుగా షిఫ్ట్ విధానంతో హైస్కూలు విద్య పడిపోయింది. అదే క్యాంపస్‌లో ఇంటర్ కళాశాల కొనసాగింపు వల్ల హైస్కూలు, ఇటు ఇంటర్ విద్యాబోధనలు,ప్రగతి పడిపోతున్న క్రమంలో ప్రచురితమైన సాక్షి కథనం రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి వెళ్లాయి.

రెండుపూటలా హైస్కూల్ తరగతులు

'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో ముప్పయేళ్ల తర్వాత బుధవారం షిఫ్ట్ లేకుండా తరగతులు నిర్వహించడం విశేషం. కానీ.. గదులు లేక చెట్ల కింద తరగతులు నిర్వహించుకోవాల్సి వచ్చింది.

ఇంటర్‌బోర్డు కమిషనరుతో మేడా చర్చలు

నందలూరు హైస్కూల్ క్యాంపస్‌లో ఇంటర్ కళాశాల కొనసాగించడం వల్ల దశాబ్దాల పాటు కొనసాగిన షిఫ్ట్ విధానానికి ఇప్పటికైనా స్వస్తి పలకాలని ఇంటర్‌మీడియట్ బోర్డు కమిషనరు కృతికాశుక్లాతో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్ రెడ్డి ఫోన్ ద్వారా చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో హైస్కూల్ క్యాంపస్‌లో ఇంటర్ కళాశాల కొనసాగింపుపై కొనసాగుతున్న అంశంపై ఆమెతో మాట్లాడారు. షిఫ్ట్ విధానం నుంచి హైసూ్కలు, ఇంటర్‌కు విముక్తి కల్పించడం వల్ల విద్యాప్రగతికి బాటలు వేసినమవుతామని వివరించారు. ఈ విషయమై కమిషనరు సానుకూలంగా స్పందించారని రాజ్యసభసభ్యుడు మేడా రఘునాథ్ రెడ్డి ధృవీకరించారు. ఇంటర్‌కళాశాలకు సొంతభవనం నిర్మాణం విషయంలో అన్ని విధాలుగా తన సహకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభం
- సమయ వేళలు పొడిగింపు



కాలేజీలో పాఠాలు బోధిస్తున్న అధ్యాపకులు

మదనపల్లె సిటీ: ఇంటర్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళిక రచిస్తున్నారు. కష్ట ఫలి సూత్రాన్ని విద్యార్థులకు వివరించడంతో పాటు ఆచరణలో పెడుతున్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. గడువు సమయాన్ని పెంచి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మొదటి సంవత్సరంలో 15,462, ద్వితీయ సంవత్సరంలో 14,721 మంది విద్యార్థులు ఉన్నారు.

ఉదయం 9 గంటల నుంచి...

ఇంటర్మీడియట్ కాలేజీలలో గతంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు తరగతులు ఉండేవి. ప్రస్తుతం 9 గంటల నుంచి 5 వరకు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలతో పాటు గిరిజన సంక్షేమ గురుకుల, కేజీబీవీలు, ప్లస్‌టూ, వృత్తి విద్య కళాశాలల్లో విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని వీడి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు రోజూ సాయంత్రం 4 నుంచి సాయంత్రం 5 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అన్ని సబ్జెక్టుల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అధ్యాపకులు తర్ఫీదు ఇస్తున్నారు. వెనుకబడిన వారు మెరుగైన ఫలితాలు తెచ్చుకోవాలని ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు.

పరీక్ష పత్రాలు ఆన్‌లైన్ ద్వారా...

ఇంటర్మీడియట్‌కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే ప్రశ్నపత్నం అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా ప్రశ్నపత్రాలను పరీక్షకు గంట ముందు ఉంచితే వాటిని కళాశాల ప్రిన్సిపాళ్లు డౌన్‌లోడ్ చేసుకుని జిరాక్స్ తీసి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. దీని వల్ల మాస్ కాపీయింగ్‌కు తావుండదంటున్నారు. ప్రస్తుతానికి క్వార్టర్లీ పరీక్షలు పూర్తయి.. వాటి మార్కులను ఇంటర్‌బోర్డు పంపించారు. మూడో యూనిట్ టెస్టు పరీక్షలు కూడా పూర్తి చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి చర్చిస్తారు. పిల్లల విద్యాప్రగతిని వివరిస్తారు.

ప్రోగ్రెస్ కార్డులు అందజేత

ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు లేత పసుపురంగు,ద్వితీయ సంవత్సరం వారికి నీలం రంగు, వృత్తి విద్య కోర్సుల వారికి తెలుపు రంగు ప్రోగ్రెస్ కార్డులను ముద్రించి ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది నుంచే అన్ని కాలేజీల్లో విద్యార్థులకు పరీక్షల్లో సాధిస్తున్న మార్కులు, హాజరు, అంతర్గత పరీక్షల మార్కులు, అన్నింటినీ కార్డుల్లో పొందుపరచనున్నారు. పరీక్షలు పూర్తయిన అయిదు రోజుల్లోగా విద్యార్థుల ఫలితాలను ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేయడంతో పాటు ఇంటర్మీడియట్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలు:	24
ఎయిడెడ్ హైస్కూల్ ప్లస్:	9
మోడల్ స్కూళ్లు:	17
సాంఘిక సంక్షేమ కాలేజీలు:	10
బీసీ గురుకుల కాలేజీ:	1
కేజీబీవీలు:	22
వృత్తి విద్యా కాలేజీలు:	10
ప్రైవేటు కాలేజీలు:	56
మొదటి సంవత్సరం విద్యార్థులు:	15,462
రెండవ సంవత్సరం విద్యార్థులు:	14,721



నిరంతర పర్యవేక్షణ



ఉత్తమ ఫలితాల సాధించడమే లక్ష్యంగా ప్రణాళిక అమలు చేస్తున్నాం. విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనుకబడుతున్నాడో గుర్తించి బోధన ఉంటుంది. అధ్యాపకులు అదనపు తరగతులు నిర్వహణ బాధ్యతను చేపట్టారు. విద్యార్థుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. గడువు సమయాన్ని పెంచినా.. దూరప్రాంతాల విద్యార్థులకు ముందుగానే పంపిస్తున్నాం.

–బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ,మదనపల్లె

బిందుసేద్యం అమలు లక్ష్యసాధనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీప్రసన్న

గుర్రంకొండ: జిల్లాలో 30,950 హెక్టార్లలో బిందుసేద్యం అమలు చేసేలా లక్ష్యం నిర్దేశించుకొన్నామని జిల్లా బిందుసేద్యం అధికారిణి లక్ష్మీప్రసన్న అన్నారు. గురువారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ముందు బిందుసేద్యం ఏర్పాటు చేసుకొందాం- ఆ తర్వాత పంటలు సాగు చేద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2024-25 ఏడాదికి గానూ జిల్లాలో నిర్దేశం చుకొన్న మేరకు 30950 హెక్టార్లలో బిందుసేద్యం అమలు చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 4646 హెక్టార్లకు బిందుసేద్యం పరికరాల మంజూరుకు అనుమతి ఇచ్చామన్నారు. నిర్ణీత గడువులోగా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు వ్యవసాయశాఖ సిబ్బంది చొరవ చూపాలన్నారు. 5 ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు 90 శాతం రాయితీ, 10 ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు 70 శాతం రాయితీ ఇస్తామన్నారు. అనంతరం ఆర్‌బీకే సిబ్బందికి బిందుసేద్యం రిజిస్ట్రేషన్ నమోదు, పొలం ప్రాథమిక సర్వే, అంతిమ తనిఖీలు, వివిధ పంటల్లో ఎరువుల యాజమాన్యంపై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఎంఐడీసీ హరినారాయణ,ఎంఐఏవో ఉమాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అంకిరెడ్డి పల్లి పంచాయతీ ఎగువపల్లి వద్ద కూలీలతో వెళుతున్న ఓ ఆటో గురువారం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. మండల కేంద్రానికి చెందిన పలువురు దినసరి కూలీలు వ్యవసాయ పనుల కోసం ఆటోలో వెళుతుండగా రోడ్డుకు అడ్డుగా వచ్చిన దూడను డ్రైవర్ తప్పించబోయి ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడిన వారిలో పలువురు స్థానికంగా ప్రథమ చికిత్స చేయించుకోగా మరో ముగ్గురు కూలీలు మెరుగైన వైద్యం కోసం మదనపల్లి ఆసుపత్రికి వెళ్లారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

మదనపల్లె : కారు ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలం చేనేతనగర్‌లో జరిగింది. ములకలచెరువుకు చెందిన బాబా ఫకృద్దీన్(42), అతడి భార్య ముబీన్‌తాజ్(35), కుమార్తె నఫియాఫిర్దౌస్(4)లు ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా చేనేతనగర్ వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గుర్రంకొండ మండలం సూరప్పగారిపల్లెకు చెందిన రెడ్డిరాజు భార్య దుర్గ(26) అత్త తిట్టిందని పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించడంతో 108 అంబులెన్స్‌లో బాధితురాలిని మదనపల్లెకు తీసుకు వస్తున్నారు. 108 సిబ్బంది మార్గమధ్యంలో చేనేతనగర్ వద్ద రోడ్డుప్రమాద ఘటనలో గాయపడిన ముగ్గురినీ వాహనంలోకి ఎక్కించుకుని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఎక్సైజ్ దాడుల్లో కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : మండలంలో ఎక్సైజ్ సిబ్బంది జరిపిన దాడుల్లో వేర్వేరు ప్రాంతాల్లో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ భీమలింగ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బార్లపల్లె గ్రామశివారులో కర్ణాటక అక్రమ మద్యం కలిగి ఉన్న కుమారిని అరెస్ట్ చేసి, ఆమెవద్ద నుంచి 96 టెట్రా ప్యాకెట్లను సీజ్ చేశామన్నారు. అలాగే మండలంలోని వేంపల్లె క్రాస్ వద్ద కర్ణాటకకు చెందిన అక్రమ మద్యం విక్రయిస్తున్న చీకలబైలుకు చెందిన వెంకటరమణ అలియాస్ సుల్తాన్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 28 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐ జబీవుల్లా, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రంగానాయక్, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, దామోదర్‌రెడ్డి, శివరాణి పాల్గొన్నారు.

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై మాట నిలబెట్టుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం దీక్షలు చేసిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాట నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఆర్సెలర్ మిట్టల్ – నిప్పన్ స్టీల్ ఇండియా ఉమ్మడిగా రూ. 1,47,162 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఉక్కు ఫ్యాక్టరీకి కావాల్సిన అనుమతులు, కేటాయింపులకు ఉపక్రమించిన కూటమి ప్రభుత్వం కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంపై స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేయలేదని అప్పటి రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, బీటెక్ రవి 2018 జూన్ 20న కడప జిల్లా పరిషత్ ఆవరణలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని గుర్తు చేశారు.

శిక్షణ పేరుతో ప్రాణాలను బలిగొంటారా?

డీఈఓ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నిరసన



డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : శిక్షణల పేరుతో ఉపాధ్యాయుల ప్రాణాలను బలిగొంటారా అని రాష్ట్ర ప్రభుత్వంపై యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన లీడర్‌షిప్ రెసిడెన్షియల్ శిక్షణా తరగతుల్లో ఇద్దరు ప్రధానోపాధ్యాయులు మరణించడం పట్ల, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని, విద్యాశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లీడర్‌షిప్ ట్రైనింగ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణలను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. వేసవి సెలవుల్లో ఇవ్వాల్సిన శిక్షణలను విద్యా సంవత్సరం మధ్యలో ఏర్పాటు చేయడమే కాకుండా ఉపాధ్యాయులు కచ్చితంగా రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ పొందాలని అడ్డగోలు నిబంధనలను విధించి ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. శిక్షణా కేంద్రాలలో సరైన సౌకర్యాలు లేక, అనారోగ్యాలతో ఉన్న ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మొదటి విడత శిక్షణలో ఏలూరు జిల్లాలోని అగిరిపల్లె శిక్షణా కేంద్రంలో టి.వి.రత్న కుమార్ అనే ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించగా, రెండవ విడత శిక్షణలో విజయనగరం జిల్లా గజపతినగరంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులలో గురువారం సిరిపురం శ్రీనివాసరావు అనే మరో ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించాడన్నారు. ఇద్దరు ప్రధానోపాధ్యాయుల మరణానికి కారణమైన రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా తమ అనాలోచిత విధానాలను విడనాడి శిక్షణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి. రమణ, ఏజాస్ అహ్మద్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల మృతికి బాధ్యులెవరు?

కడప ఎడ్యుకేషన్ : రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయుల మృతికి ఎవరు బాధ్యత వహిస్తారని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం కడప ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమం వలన ఇద్దరు ఉపాధ్యాయులు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. శిక్షణ కార్యక్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ కార్యక్రమాలు రద్దు చేసి ఉపాధ్యాయుల కుటుంబానికి తక్షణమే తగిన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్టీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి బి.చంద్రశేఖర్, సలాం, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయా:ఏపీటీఎఫ్

రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాలను రద్దుచేసి నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో తాలూకా కేంద్రాలలో నిర్వహించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించవద్దని అనేకమార్లు డిమాండ్ చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు.

ఉపాధ్యాయులను వేధించడం తగదు

రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ వేధింపులను తక్షణమే మానుకోవాలని వైఎస్సార్ టీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.శివశంకర్ రెడ్డి, పి. రెడ్డప్పరెడ్డి, డి.మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉపాధ్యాయులలో ఒత్తిడి పెరిగి ప్రాణాల మీదకు తెస్తోందన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొనడం ఇబ్బందికరంగా ఉందన్నారు. భవిష్యత్తులో జరగబోయే శిక్షణలను పాఠశాలల పనివేళల్లోనే నిర్వహించాలన్నారు.

రెవెన్యూ సమస్యలపై స్పందించాలి

మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్


తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

కలికిరి : ప్రజల నుంచి వచ్చిన రెవెన్యూ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన పీజీఆర్ఎస్ వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. తుఫాను వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, మ్యుటేషన్, గ్రామ సభలలో ప్రజల నుంచి వినతులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ నెల 30న సెలవు కావడంతో ప్రభుత్వం ఒకరోజు ముందుగానే సామాజిక పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టిందని, ఇందుకు రెవెన్యూ సిబ్బంది కూడా సహరించాలన్నారు. అంతకు మునుపు కలికిరి పట్టణ పరిధిలోని కలికిరి–1, కలికిరి–4 అంగన్‌వాడీ కేంద్రాలను సబ్ కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ మహేశ్వరీబాయి, డిప్యూటీ తహసీల్దార్ నవీన్, ఐసీడీఎస్ సీడీపీఓ భారతి, సూపర్‌వైజర్ అరుంధతి, అంగన్‌వాడీ సిబ్బంది, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ వైఖరిపై అయ్యప్ప భక్తుల ఆగ్రహం


రాజంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన అయ్యప్ప భక్తులు

రాజంపేట : రాజంపేట మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు వైఖరిపై రాజంపేట అయ్యప్ప భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అయ్యప్ప భక్తులు మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యాలయంలో పదేళ్లుగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బుధవారం విధి నిర్వహణలో భాగంగా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లిన తనను కమిషనర్ పిలిపించి దుర్భాషలాడారన్నారు. గత పదేళ్లుగా తాను ప్రతి సంవత్సరం అయ్యప్పమాల ధరించి, విధులు నిర్వహిస్తున్నానన్నారు. కమిషనర్ నాగేశ్వరరావు తనను కొద్దిరోజులుగా అయ్యప్పమాల వేసుకున్నానని కూడా చూడకుండా పరుషంగా మాట్లాడుతున్నారని చెప్పారు. అయ్యప్ప సమాజ సేవా సమితి అధ్యక్షుడు పాల ప్రకాశ్, ప్రతినిధి వర్థిబోయిన సుధాకర్‌బాబు మాట్లాడుతూ అయ్యప్పభక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన కమిషనర్ వెంటనే క్షమాపణలు చెప్పాలన్నారు. కాగా అయ్యప్పభక్తులు ఆందోళన చేస్తుండటంతో కమిషనర్ కార్యాలయానికి రాకుండా ముఖం చాటేశారు. జిల్లా వ్యాప్తంగా అయ్యప్పస్వాములతో ఉద్యమిస్తామని పలువురు స్వాములు హెచ్చరించారు. కార్యాలయానికి రాకపోవడంపై కమిషనరుకు విలేకరులు ఫోన్ చేసి అడిగితే పలు కారణాలు వెల్లడించారు.

ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

20 దుంగలు, ఒక ఇన్నోవా కారు స్వాధీనం

రాయచోటి టౌన్ : ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న 12 మంది స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ తెలిపారు. ఈ మేరకు గురువారం రాయచోటి డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. బుధవారం వీరబల్లె మండల కేంద్రానికి సమీపంలోని ఈడిగపల్లె రిజర్వ్ ఫారెస్టు నుంచి అక్రమంగా ఎర్రచందనం తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐలు మోహన్ నాయక్(వీరబల్లె), భక్తవత్సలం (సంబేపల్లె), శ్రీనివాసులు (సుండుపల్లె), ఆర్.రజని (సానిపాయి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్), మురళీధర్ రెడ్డి (ఆర్ఎస్ఐ, తిరుపతి) దాడులు నిర్వహించారని తెలిపారు. ఈ దాడిలో 12 మందిని అరెస్టు చేసి 20 చందనం దుంగలు, ఒక ఇన్నోవా కారు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి విలువ మొత్తం రూ.17,42,271లు ఉంటుందని అంచనా వేసినట్లు వివరించారు. అరెస్టయిన వారిలో 11మంది తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన వారు కాగా, ఒకరు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గాండ్ల లతీఫ్‌బాషా అని తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

సర్టిఫికెట్ కోసం వెళ్లి విద్యార్థిని అదృశ్యం

రాయచోటి (సంబేపల్లి) : బర్త్ సర్టిఫికెట్ కోసం సంబేపల్లి మండల కేంద్రానికి వచ్చిన విద్యార్థిని ఎనుగొండ ఆశ(18) అదృశ్యమైంది. సంబేపల్లి మండలం నాగిరెడ్డిపల్లి పంచాయతీ అన్నప్పగారిపల్లికి చెందిన ఎనుగొండ రమణయ్య కుమార్తె ఆశ. ఈమె కడప కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం బర్త్ సర్టిఫికెట్ కోసం మండల కేంద్రానికి వచ్చిన కుమార్తె సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో తండ్రి రమణయ్య కుమార్తెకు ఫోన్ చేసినా స్పందన రాలేదు. రెండు రోజుల పాటు కనిపించకుండా వెళ్లిన విద్యార్థిని కోసం కళాశాల, ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆరా తీసినా సమాచారం దొరకలేదు. దీంతో విద్యార్థిని తండ్రి రమణయ్య గురువారం సంబేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

రాయచోటి (జగదాంబసెంటర్) : రాయచోటి పట్టణం మాసాపేటలో గల శ్రీ సుగవాసి రాజారాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.శివకుమార్‌రెడ్డి తెలిపారు. అనంతపురంలోని వజ్రకరూరులో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి కడప జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించి కె.అరాఫత్ (పదవ తరగతి) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే చిత్తూరు జిల్లాలోని తవణంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్–14 సాఫ్ట్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో కడప జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించి జిల్లా జట్టు నుంచి పి.వెంకటేష్(9వ తరగతి), బి.భవంత్‌సాగర్(9వ తరగతి) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదే విధంగా ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు తిరుపతిలోని మంగళం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్–14 బేస్‌బాల్ విభాగంలో కడప జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించి ఎం.సంతోష్(9వ తరగతి), బి.సంతోష్(8వ తరగతి) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరులో జరిగిన అండర్–17 బేస్‌బాల్ పోటీలో డి.శివరాం(10వ తరగతి) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎం శివకుమార్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ పాఠశాల నుంచి ఈ సంవత్సరం ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ సంచాలకుడు ఏ.జగదీశ్వరయ్య తెలిపారు. విద్యార్థులను వ్యాయామ సంచాలకుడు సీబీ మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎం.ఉత్తన్న క్రీడా పరికరాల కోసం రూ.20 వేలు ఆర్థిక సాయం పాఠశాలకు అందజేశారు.

సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యం

మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి


ఒంటిమిట్ట: రహదారిలో గుంతలను పూడ్చుతున్న ఆర్అండ్‌బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

రాజంపేట : సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా కూటమి సర్కారు ముందుకెళుతోందని రోడ్లు భవనాలశాఖ మంత్రి, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. రాజంపేటలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో గురువారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆర్అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డి ఆయనకు రోడ్ల పరిస్థితి గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి, టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, క్షత్రియ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, నాయకులు సుబ్రమణ్యం నాయుడు, రాంనగర్ సంజీవి, డాక్టర్ సుధాకర్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించిన మంత్రి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలం మల్లకాటిపల్లిలో పాట్‌హోల్ ఫ్రీ ఏపీ (గుంతల రహిత రోడ్ల) కార్యక్రమంలో భాగంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి రోడ్ల మరమ్మతు పనులను పర్యవేక్షించారు. అనంతరం రూ. 4.9 లక్షలతో మల్లకాటిపల్లి నుండి బెస్తపల్లి వరకు 11 కిలోమీటర్ల మేర చేపట్టిన రహదారుల ప్యాచ్ వర్క్ పనులలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 53వ జీఓ 349 ప్రకారం రాష్ట్రంలో గుంతల రహిత రహదారులను నిర్మించే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.861 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అందులో కడప జిల్లాకు 269 పనులకుగాను రూ.38.53 కోట్లు ఇచ్చిందన్నారు.

దశలవారీగా సూపర్‌సిక్స్ అమలు

ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తామని రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఒంటిమిట్ట పర్యటనలో భాగంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఆరు నెలల్లో పింఛన్ పెంచాం, డీఎస్సీకి సిద్ధమవుతున్నాం, ఉచిత గ్యాస్ సిలిండర్‌ను వదిలాం, త్వరలో ఉచిత బస్‌ను కూడా తీసుకొస్తాం అన్నారు. సూపర్ సిక్స్‌లో ఏ పథకాలు చెప్పామో అవన్నీ దశల వారీగా ఇస్తామన్నారు. కాగా, నిత్యం సమస్యలతో ఆగిపోతున్న ఒంటిమిట్ట శ్రీరామ ఎత్తిపోతల పథకం పంపహౌస్‌కి మరలా పూర్వ వైభవంగా తీసుకురావాలని ఒంటిమిట్ట మండల టీడీపీ నాయకుడు కొమర వెంకటనరసయ్య కోరగా దానికి మంత్రి జనార్ధన్ రెడ్డి స్పందిస్తూ గతంలో టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు.

తోక పత్రికలతో విష ప్రచారం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల


మాట్లాడుతున్న రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై అసత్య రాతలను రాస్తున్న పచ్చ పత్రికలకు ప్రజలు బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చట్ట పరంగా రాష్ట్రాలకు మేలు చేసేందుకు సోలార్ ఎనర్జీపై కేంద్ర సంస్థ సెకీ నిబంధనల మేరకు ఏపీతో ఒప్పందాలు జరిగాయన్నారు. ఈ అంశంపై అర్థంపర్థంలేని కథనాలు రాస్తుండటం ఆ పత్రికల దిగజారుడుతనమని మండిపడ్డారు. చంద్రబాబుకు బాకాలు ఊదే పత్రికలు అసత్యాలు తప్పా నిజాలు ఎలా రాస్తాయని చెప్పారు. వీటిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. హామీల అమలులోనే ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాల కోరుతనం అసెంబ్లీ సాక్షిగా నిరూపితమైందన్నారు. 2019లో అధికారం పోగొట్టుకొన్నప్పటి నుంచి తన తోక పత్రికలతో అప్పటి తమ ప్రభుత్వంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఎన్నికల ముందు రూ.14 లక్షల కోట్లు అప్పు అని ఆరోపించిన చంద్రబాబు అసెంబ్లీలో బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రం అప్పు కేవలం రూ. 6 లక్షల కోట్లు మాత్రమే అని చెప్పడం వారి డొల్లతనాన్ని వారే ఒప్పుకున్నట్లయిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక విద్యుత్ బాదుడు వేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైస్‌పుల్లింగ్ చీటింగ్ కేసులో ముగ్గురి అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : రైస్‌పుల్లింగ్ పేరుతో మోసగించిన కేసులో ముగ్గురిని టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రైస్‌పుల్లింగ్ వ్యాపారంలో అరుదుగా లభించే ఇరిడియం లోహంతో తయారు చేసిన పాత్రలు కలిగి ఉంటే వాళ్ల జీవితాలు మారిపోతాయని మాయ మాటలు చెప్పి దువ్వూరు మండలం గోపులాపురం గ్రామానికి చెందిన మూలె వెంకటరమణారెడ్డిని ఇరువురు మహిళలు మోసగించారు. అతని నుంచి సుమారు రూ. 1.37 కోట్లు వసూలు చేశారు. ఈ క్రమంలో మోసానికి పాల్పడ్డ బెంగళూరుకు చెందిన అగిలి అపర్ణ, కదిరికి చెందిన అగిలి అరుణకుమారి, అనంతపురం టౌన్‌కు చెందిన నడిమింటి రామాంజనేయులును గురువారం మదూరు రోడ్డులో అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వివరించారు.

ఆశా వర్కర్ల హామీలు నెరవేర్చాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగానికి భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని తక్షణం నెరవేర్చాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి సుభాషిణి, యూనియన్ జిల్లా నిర్మాణ బాధ్యుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, రాజకీయ నాయకుల అధికారుల వేధింపులు ఆపాలని, ఉద్యోగాలకు భద్రత కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. యూనియన్ నాయకులు, బి.శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సౌత్, సెంట్రల్ జట్లు విజయం

సెంచరీలతో చెలరేగిన రేవంత్, శ్రావణ్


151 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన తూర్పుగోదావరి బ్యాట్స్‌మన్ సాయిశ్రావణ్


131 పరుగులు చేసిన సౌత్‌జోన్ బ్యాట్స్‌మన్ కె. రేవంత్‌రెడ్డి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–23 జోనల్ క్రికెట్ మ్యాచ్‌లలో సౌత్ జోన్, సెంట్రల్‌జోన్, తూర్పుగోదావరి జట్లు విజయం సాధించాయి. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్టాఫ్ సెంట్రల్, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెంట్రల్ జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 203 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కె.ఎస్.ఎన్. రాజు 56, స్వామినాయుడు 43 పరుగులు చేశారు. అనంత బౌలర్లు దత్తారెడ్డి 3, లోహిత్‌సాయి 2, దీపక్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 37.2 ఓవర్లలో 176 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని యోగానంద 46, జయకృష్ణ 37 పరుగులు చేశాడు. సెంట్రల్‌జోన్ బౌలర్లు మానస్ 4, సుశాంత్‌నాయుడు 4 వికెట్లు తీశారు. దీంతో రెస్టాఫ్ సెంట్రల్ జోన్ జట్టు 26 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

సౌత్‌జోన్ విజయం : కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్టాఫ్ నార్త్‌జోన్, రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. జట్టులోని హర్షవర్ధన్ 63, పూర్ణతేజ 55 పరుగులు చేశారు. సౌత్‌జోన్ బౌలర్లు అఖిల్ 3, సాకేత్‌రామ్ 2, మాధవ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్టు 45.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని కె. రేవంత్‌రెడ్డి 97 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్లతో చెలరేగాడు. ఈయనకు జతగా నిఖిలేష్ 54 పరుగులు చేశాడు. దీంతో సౌత్‌జోన్ జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

తూర్పుగోదావరి జట్టు విజయం : కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో ప్రకాశం, తూర్పుగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ప్రకాశం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 46.2 ఓవర్లలో 286 పరుగులు చేసి ప్రకాశం జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని రోహిత్ 77, అభినవ్ 92 పరుగులు చేశారు. తూర్పుగోదావరి బౌలర్లు శివ 4, వంశీనారాయణ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 47.4 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని టి.వి. సాయిశ్రావణ్ 138 బంతుల్లో 18 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 151 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. పాండురంగరాజు 37 పరుగులు చేశాడు. దీంతో తూర్పుగోదావరి జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

కాదేదీ ఆక్రమణకు అనర్హం!

- ఆర్అండ్‌బీ స్థలంలో దర్జాగా దుకాణాల కొనసాగింపు
- నెల రోజుల నుంచి ఖాళీ చేయించలేక ఆపసోపాలు


గాలివీడు నాలుగురోడ్ల కూడలిలోని ఆక్రమిత స్థలం

గాలివీడు : ఆక్రమణకు కాదేదీ అనర్హం అంటూ ఏకంగా నాలుగురోడ్ల కూడలినే ఆక్రమించేశారు ఆక్రమణదారులు. గత నెల రోజులుగా ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకోలేక ఆర్ అండ్ బీ, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఆపసోపాలు పడుతుండటం గమనార్హం. స్థానికుల ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఆక్రమణదారులకు నోటీసులు, హెచ్చరికలతో మమ అనిపించారు. దీంతో రేకుల షెడ్లు కాస్తా దుకాణాలుగా మారిపోవడంతో ప్రజలు తీవ్ర స్థాయిలో అధికారుల తీరుపై మండిపడుతున్నారు. గాలివీడు నడిబొడ్డున నాలుగు రోడ్ల కూడలిలో సర్వే నంబర్ 2266లో 1.80 సెంట్ల ఆర్ అండ్ బీ స్థలం ఉంది. అందులో కొంత రహదారి విస్తరణ కోసం అక్కడున్న బస్ షెల్టర్‌ను సైతం కూల్చివేసి చదును చేశారు. అయితే అది కాస్తా ఆక్రమణదారుల చెరలో చిక్కుకుని దర్జాగా రేకుల షెడ్లతో దుకాణాలు ఏర్పాటు చేయడం స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. జిల్లా అధికారులు ఒత్తిడి తెచ్చినా, స్థానిక యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసినా ఆక్రమణదారులు మాత్రం వెనక్కు తగ్గడం లేదు. ఇప్పటికైనా కోట్లు విలువజేసే ప్రభుత్వ భూమి భూ బకాసురుల చేతికి పోకుండా స్వాధీనం చేసుకుని ఆక్రమణలకు అడ్డుకట్టపడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం

ఆర్అండ్‌బీ స్థలంలో ఉన్న రేకుల షెడ్లు వెంటనే తొలగిస్తాము. ఆక్రమించిన వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. ఇప్పటికే ఆక్రమణదారులకు పలుమార్లు తాఖీదులు ఇచ్చాము. ఇక చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– భాగ్యలత, తహసీల్దార్, గాలివీడు

ఆర్అండ్‌బీ స్థలం స్వాధీనం చేసుకుంటాం

రహదారి విస్తరణలో ఉన్న ఉన్న ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంటాం. రెవెన్యూ అధికారులు, పోలీసుల సహకారంతో ఆ స్థలాన్ని ఖాళీ చేయిస్తాము. ఇప్పటికే వారిని పలు మార్లు హెచ్చరించాము.

– వెంకటసుబ్బయ్య, డీఈ, ఆర్అండ్‌బీ